సాక్షి పల్నాడు

మంగళవారం ၊ 14 ၊ అక్టోబర్ ၊ 2025



సీహెచ్‌సీ సందర్శన

పొన్నూరు: నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం సందర్శించింది. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.



పులిచింతల సమాచారం

పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 41,082 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 82,027 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 42.1600 టీఎంసీలు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ సోమవారం దుర్గమ్మను దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

విద్యార్థుల సంరక్షణే ప్రథమ బాధ్యత

జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



నరసరావుపేట: జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీలు, గురుకులాల్లో భోజనం, తాగు నీరు, వసతులు, ప్రథమ చికిత్స, పారిశుద్ధ్యం వంటి కనీస వసతుల కొరత లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీలు, గురుకులాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సంరక్షణే ప్రప్రథమ బాధ్యతని స్పష్టం చేశారు. ప్రభుత్వ హాస్టళ్లపై తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, డయేరియా, వివిధ రకాల జ్వరాలు నమోదైతే ఎలా స్పందించాలో తెలుపుతూ మెటీరియల్ పంపిణీ చేయాలన్నారు. కాచి వడగట్టిన నీటిని మాత్రమే విద్యార్థులకు అందించాలన్నారు. అన్ని వసతి గృహాల్లో మూడు రోజుల్లోగా తాగునీటి పరీక్షలు నిర్వహించి నివేదిక సమర్పించాలన్నారు. బయటినుంచి ఆహార పదార్థాలను నిషేధించాలన్నారు. వసతి గృహాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. వసతి గృహ విద్యార్థులు పదోతరగతి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. డీఈఓ చంద్రకళ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి, డీపీఓ నాగేశ్వర్ నాయక్, సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు నకిలీ మద్యంపై నిరసన

నరసరావుపేట: రాష్ట్రంలో వెలుగుచూసిన నకిలీ మద్యంపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారికి వినతిపత్రం అందజేయటం జరుగుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద నుంచి బయలుదేరి ప్రకాష్‌నగర్‌లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉదయం 10గంటలకు పార్టీ కార్యాలయం వద్దకు తరలిరావాలని కోరారు.

టెయిల్‌పాండ్ నుంచి 58,122 క్యూసెక్కులు విడుదల



రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్దనున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 5 క్రస్ట్‌గేట్లు, రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పాదన అనంతరం మొత్తం 58,122 క్యూసెక్కులను పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం సోమవారం తెలిపారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు రిజర్వాయర్ 5 క్రస్ట్‌గేట్లు రెండు మీటర్లు ఎత్తు ఎత్తి 49,720 క్యూసెక్కులు, రెండు యూనిట్ల ద్వారా విద్యుత్పాదన అనంతరం 8,402 క్యూసెక్కులు మొత్తం 58,122 క్యూసెక్కులను దిగువనున్న పులిచింతల ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. నీటి మట్టం ప్రాజెక్టు 75.50 మీటర్లకు గాను 75.50 మీటర్లకు నీరు చేరుకుందన్నారు.

ఐటీఐ ఐదో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు

మాచర్ల: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఐదో విడత అడ్మిషన్ల కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్, మాచర్ల ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నరేంద్ర సోమవారం తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం 4గంటలలోపు తమ కళాశాలకు వచ్చి ధ్రువీకరించుకొని దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్టోబర్ 17న ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు మాచర్ల పీడబ్ల్యూడీ కాలనీలోని ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.



వినుకొండలో ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



సత్తెనపల్లిలో నకిలీ మద్యంపై నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి, మహిళలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

నకిలీ మద్యంపై కన్నెర్ర

కదంతొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

నకిలీ మద్యం తయారు చేస్తూ.. దాన్ని ఊరు, వాడా సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న టీడీపీ ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి మహిళలు రణభేరి మోగించారు. ప్రజల ప్రాణాలంటే లెక్కచేయని పాషాణ ప్రభుత్వపు కూసాలు కదిలేలా పదం పదం కదిపి.. కదం తొక్కారు. జిల్లాలోని చాలా ఊళ్లకు మంచినీటి సరఫరా లేదు గానీ నకిలీ మద్యం మాత్రం ఏరులై పారిస్తున్నారంటూ గర్జించారు. నకిలీ మద్యం తయారు చేస్తూ టీడీపీ నేతలు ఆధారాలతో సహా పట్టుబడినా.. ప్రభుత్వ పెద్దలు బుకాయించడం.. ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొని సర్కారు తీరుపై కన్నెర్ర చేశారు.

- జిల్లావ్యాప్తంగా కొనసాగిన నిరసన ర్యాలీలు
- వర్షాన్ని సైతం లెక్కచేయక కదం తొక్కిన మహిళలు
- ఎక్సైజ్ కార్యాలయాల్లో వినతిపత్రాల సమర్పణ
- కల్తీ మద్యంపై సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్
- గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలపై ఆగ్రహం
- పాల్గొన్న మాజీ మంత్రి విడదల రజని, మాజీ ఎమ్మెల్యే బొల్లా, డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి, మహిళలు, పార్టీ నేతలు, కార్యకర్తలు

సాక్షి, నరసరావుపేట: ప్రజల ప్రాణాలు తీస్తున్న నకిలీ మద్యాన్ని అరికట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు జరిగిన నిరసన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, మహిళలు కదం తొక్కారు. నియోజకవర్గ కేంద్రాలలో చేపట్టిన నిరసన ర్యాలీలు, ఎక్సైజ్ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేసే కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున మహిళలు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొని కూటమి ప్రభుత్వం మద్యం విధానాలను తూర్పారబట్టారు. కల్తీ మద్యంపై సిట్ విచారణ కాకుండా సీబీఐ విచారణచేపట్టాలని డిమాండ్ చేశారు.



చిలకలూరిపేటలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి విడదల రజిని, మహిళలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

నకిలీ మద్యం ఏరులై పారుతోంది

నారా వారి పాలనలో నకిలీ మద్యం ఏరులై పారుతోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత విడదల రజిని విమర్శించారు. నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ రణభేరి కార్యక్రమం సోమవారం చిలకలూరిపేటలో నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి మాజీ మంత్రి ర్యాలీ నిర్వహించారు. అడ్డరోడ్డు సెంటర్ నుంచి చిలకలూరిపేట ఎక్సైజ్ స్టేషన్‌కు ప్లకార్డులు చేతబట్టి నకిలీ మద్యానికి నిరసనగా నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. ఎక్సైజ్ స్టేషన్ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విడదల రజిని మాట్లాడుతూ నకిలీ మద్యం తయారు చేస్తూ, అక్రమ పద్ధతిలో విక్రయాలకు పాల్పడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ టీడీపీ నాయకులు పట్టుబడినా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇంత విచ్చలవిడిగా, పరిశ్రమ మాదిరిగా యంత్రాలు పెట్టి నకిలీ మద్యం తయారు చేస్తూ టీడీపీ నేతలు రూ.కోట్లు గడిస్తున్నారని ఆరోపించారు. గ్రామ గ్రామాన వెలిసిన బెల్టుషాపులతో ప్రజల జీవితాలు సర్వనాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్టు షాపుల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సింది పోయి అధికార పార్టీ నాయకులే వేలం పాటలు నిర్వహించి ఏర్పాటు చేయించటం సిగ్గుచేటన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు జరిగేవని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో ఉండే సిట్ దర్యాప్తు కేవలం నిజాలను సమాధి చేయడానికి, కేసును నీరుగార్చటం కోసమేనని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సీబీఐ ద్వారా దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.

సీబీఐ విచారణ జరిపించాలి

రాష్ట్రంలో వందలాది కుటుంబాలు నకిలీ మద్యానికి బలైపోతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ర్యాలీగా నరసరావుపేట రోడ్డు లోని ఎక్సైజ్ స్టేషన్ వరకు వెళ్లి సీఐ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నేతలు నకిలీ మద్యం తయారు చేయడంతో పాటు అమాయకుల ప్రాణాలు బలిగొనడం దారుణమన్నారు. ప్రభుత్వం ఒక వైపు నకిలీ మద్యం తయారు చేయిస్తూ.. ఎమ్మెల్యేలు, ఎంపీలు వాటాలు పంచుకుంటూ.. మరో వైపు గ్రామాల్లో బెల్టు షాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేసి మద్యాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులకు ఆదాయ వనరుగా మార్చారని విమర్శించారు. కల్తీ మద్యంపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరులో సోమవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టి ఎక్సైజ్ సీఐ టి.తులసికి వినతిపత్రం అందజేశారు. ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఈదా సాంబిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలను పణంగా పెడుతుందన్నారు.

గురజాలలో..

నకిలీ మద్యం వలన ఎంతో మంది పేదలు ప్రాణాలు కోల్పోయారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), వైఎస్సార్ సీపీ బీసీ విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు సిద్దాడపు గాంధీలు అన్నారు. గురజాల ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కుటీర పరిశ్రమ లాగా నారా వారి నకిలీ మద్యం ఉందన్నారు. నకిలీ మద్యంపై వెంటనే సీబీఐ దర్యాప్తు చేపట్టాలన్నారు.

- పిడుగురాళ్లలో స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు వినతి పత్రం అందించారు. పార్టీ గురజాల నియోజకవర్గ ముస్లిం మైనార్టీ కన్వీనర్ షేక్ జైలాబ్దిన్, పట్టణ, మండల కన్వీనర్లు మాదాల కిరణ్‌కుమార్, చింతా సుబ్బారెడ్డి, దాదిన బోయిన ఏడుకొండలు పాల్గొన్నారు.

మాచర్లలో...

మాచర్లలో వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ జరిపి కూటమి ప్రభుత్వం మద్యం విధానాలను నాయకులు తూర్పారబట్టారు. అనంతరం పీడబ్ల్యూడీ కాలనీలోని ఎక్సైజ్ స్టేషన్ ముందు ధర్నా, నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి అబ్దుల్ జలీల్ మాట్లాడుతూ టీడీపీ నేతలే రాష్ట్రంలో అక్రమ మద్యాన్ని తయారు చేసి విక్రయించి, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని దుయ్యబట్టారు. ఈ వ్యవహారాన్ని పక్కదారి పట్టించేందుకు సీఎం చంద్రబాబు సిట్ పేరుతో నాటకాలకు తెరదీశారన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, బీసీ విభాగం నియోజక వర్గ అధ్యక్షుడు బూడిద శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు మాచర్ల సుందరరావులు మాట్లాడారు.

కుటీర పరిశ్రమగా నకిలీ మద్యం

సంపద సృష్టించటమంటే కుటీర పరిశ్రమ లాగా నకిలీ మద్యం తయారీ చేయటమేనా చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి ప్రశ్నించారు. నకిలీ మద్యం అరికట్టి, జరిగిన సంఘటనలపై సీబీఐ విచారణ చేపట్టాలని కోరుతూ సోమవారం వైఎస్సార్ సీపీ శ్రేణులు సత్తెనపల్లిలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి పోలీసుల ఆంక్షల నడుమ వైఎస్సార్ సీపీ నాయకుల, మహిళల ర్యాలీ ఎక్సైజ్ స్టేషన్ వరకు సాగింది. అనంతరం ఎక్సైజ్ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సుధీర్ భార్గవరెడ్డి అందించి విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వమే నకిలీ మద్యం మాఫియా నడుపుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతోందన్నారు. మద్యం కుంభకోణంపై నిజాలు రాస్తున్న సాక్షి మీడియాపై కేసులు పెడుతూ, దాడులకు దిగడం శోచనీయమన్నారు.



మాచర్లలో ఎక్సైజ్ సీఐ వెంకటరమణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



క్రోసూరులో ఎక్సైజ్ సీఐ టి.తులసికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



గురజాలలో ఎక్సైజ్ ఎస్ఐకి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీజేఐపై దాడికి ఎమ్మార్పీఎస్ నిరసన



కలెక్టరేట్‌లోకి ప్రదర్శనగా వెళుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నరసరావుపేట: సుప్రీంకోర్టు న్యాయమూర్తి బీఆర్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్), ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు నల్లజెండాలతో సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. ప్రదర్శనగా వచ్చిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ప్రవేశద్వారం ముందే నిలిపివేశారు. దీంతో వారందరూ అక్కడే బైఠాయించి ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేవలం పదిమందిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని పోలీసులు చెప్పగా వారు నిరాకరించారు. తామంతా ప్రశాంతంగా కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లి వినతిపత్రం అందజేస్తామని కోరారు. దీనిపై రూరల్ ఎస్ఐ కిషోర్, పట్టణ ఎస్ఐ ఫాతిమాలు పై అధికారుల అనుమతితో వారందరినీ లోపలికి అనుమతించారు. నినాదాలు చేస్తూ కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. దుడ్డు రామకృష్ణ మాదిగ, చిరుగూరి జత్రం, కనుమూరి కోటేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం


పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



అర్జీదారుల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 152 అర్జీలను జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా అధికారులతో కలిసి స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తి, రీఓపెన్ కాకుండా అర్జీల పరిష్కారతీరు ఉండాలని స్పష్టం చేశారు. అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువు లోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు పరిష్కారం కోసం పంపాలని కలెక్టరు సూచించారు.

కాలనీలో మౌలిక వసతులు కల్పించండి



చిలకలూరిపేటరోడ్డులోని ఎస్ఆర్‌కేటీ కాలనీకి సమీపంలో గల అస్ఫాఖుల్లాఖాన్ కాలనీలో 15ఏళ్లుగా నివాసం ఉంటున్నాం. కాలనీలో రోడ్లు, సైడు కాలువలు, వీధిలైట్లు లేవు. కనీసం చెత్త సేకరించే బండికూడా రావట్లేదు. వర్షాలకు మట్టిరోడ్లన్నీ బురదమయంగా మారి నడిచేందుకు వీలులేకుండా ఉన్నాయి. నీరు నిల్వుండి దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నాం. కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించండి.

–కె.అరుణ, అంజమ్మ, ఫాతిమా, మహబూబి, అస్ఫాఖుల్లాఖాన్ కాలనీ వాసులు

ఈనాం భూములను బోయలకే కేటాయించాలి

చిలకలూరిపేట జమిందారు బోయలకు ఇచ్చిన 2502 ఎకరాల ఈనాం భూములు బోయలకే చెందేలా ఉత్తర్వులు ఇవ్వండి. ఈ ఈనాం భూములను బోయలకు చెందకుండా ఆనాటి కరణాలు అగ్రవర్ణాలకు బినామీలుగా కట్టబెట్టారు. ఇప్పటివరకు 34 అర్జీలు పెట్టినా చర్యలు తీసుకోలేదు. దొంగ రిజిస్ట్రేషన్లు మ్యుటేషన్ రద్దుచేసి, ఎవరికి పనికిరాని ఫారం–8 రైత్వారీ పట్టాలు రద్దుచేసి నిజమైన వారసులను గుర్తించేవరకు ప్రభుత్వ స్వాధీనంలో భూములు ఉంచగలరు.



–దగ్గు నరసింహారావు, ఉమ్మడి గుంటూరు బోయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

మూడేళ్ల నాటి కేసులో వేధింపులు

- జిల్లా ఎస్పీ బి.కృష్ణారావుకు ఫిర్యాదు చేసిన విద్యార్థినులు
- పోలీసు పీజీఆర్ఎస్‌లో 117 అర్జీలు

నరసరావుపేట రూరల్: అక్రమ కేసులతో విద్యార్థినులను క్రోసూరు పోలీసులు వేధిస్తున్నారని ఓ మహిళ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ, ఆస్తి, ఆర్థిక తగాదాలు, మోసాలు తదితర సమస్యలపై 117 ఫిర్యాదులు అందాయి. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ తెలిపారు.

కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోవడం లేదు

క్రోసూరు ఎస్సీ కాంప్లెక్స్‌లో దుకాణాన్ని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను స్థానిక పోలీసులు పాటించడం లేదని క్రోసూరుకు చెందిన సీహెచ్ హనీ గ్లాడెస్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఇప్పటికే మూడుసార్లు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా కలెక్టర్ ఆదేశాలను ఎస్ఐ అమలు చేయడం లేదన్నారు. దుకాణంపై వచ్చే ఆదాయమే తనకు జీవనాధారమని తెలిపారు. టీడీపీ నాయకుల అండతోనే తన దుకాణాన్ని ఆక్రమించుకుంటున్నట్టు బాధితురాలు తెలిపారు.

అప్పు తీరినా తనఖా కాగితాలు ఇవ్వడం లేదు

అప్పు మొత్తం చెల్లించినా ఇంటి తనఖా కాగితాలు ఇవ్వడం లేదని వినుకొండకు చెందిన కంచర్ల కోటేశ్వరమ్మ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. లారీని కొనుగోలు చేసేందుకు ఎండ్లూరి అరుణ వద్ద రూ.5.75లక్షలు అప్పుగా తీసుకుని ఇంటిని తనఖా పెట్టామని తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో అప్పు మొత్తం చెల్లించి తనఖా రిజిస్ట్రేషన్ రద్దు చేసుకొని ఒరిజినల్ రిజిస్ట్రేషన్ దాక్యుమెంట్లు ఇవ్వమని అడగ్గా ఇవ్వకుండా వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నగదు ఇవ్వకుండా వేధింపులు..

మంజూరైన ముద్ర రుణం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని రెంటచింతలకు చెందిన ఎర్రపాటి లక్ష్మీరాజ్యం ఫిర్యాదు చేసారు. తుమ్రకోట యూనియన్ బ్యాంక్‌లో తనకు రూ.5.60లక్షలు ముద్ర లోన్ మంజూరైందని, ఈ నగదును బి.శ్యామ్‌రాజు అనే వ్యక్తి కంపెనీ అకౌంట్‌లో పడినట్టు పేర్కొన్నారు. ఇందులో రూ.3లక్షలు ఇచ్చి మిగిలిన నగదు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. నగదు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

ఆన్‌లైన్‌లో మహిళ మోసం చేసింది..

రైస్ బిజినెస్‌లో పెట్టుబడి పెడితో మూడు నెలల్లో డబుల్ వస్తుందని ఆన్‌లైన్ మహిళ చెప్పిన మాటలు నమ్మి మోసపోయినట్టు శావల్యాపురం మండలం మతుకుమల్లికి చెందిన ఎర్రగుంట సంపంగిరావు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఆన్‌లైన్ మార్కెట్ పరిశీలిస్తుండగా లావణ్య అనే మహిళ పరిచయమైందని, రైస్ బిజినెస్‌లో మూడు నెలల్లో పెట్టుబడికి డబుల్ వస్తుందని చెబితే రూ.7లక్షలు తన అకౌంట్‌కు చెల్లించినట్టు తెలిపాడు. రెండు నెలలు ఫోన్ కాంటాక్ట్‌లో ఉన్న మహిళ తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేసిందని, తనకు న్యాయం చేయాలని కోరాడు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు

ఎస్ఐ మారినప్పుడల్లా వేధింపులు..

మూడు సంవత్సరాల క్రితం జరిగిన ఘటనలో చదువుకుంటున్న అమ్మాయిలను ఇప్పుడు స్టేషన్‌కు రావాలని పోలీసులు ఫోన్ చేసి వేధిస్తున్నారని క్రోసూరు మండలం యర్రబాలెంకు చెందిన మేకుల రోజానమ్మ జిల్లా ఎస్పీ ఎదుట వాపోయింది. గతంలో పొగాకు పనికి వచ్చేందుకు తన వద్ద పల్లె ప్రతాప్, మేరీలు రూ.లక్ష తీసుకున్నారని, పనికి రాకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వమని తాను అడగటం జరిగిందన్నారు. దీంతో గొడవకు దిగిన వారు తనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసారని తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి ఎస్ఐలు మారినప్పుడల్లా కేసుపై మాట్లాడాలని తనను, తన కుమార్తెలను స్టేషన్‌కు పిలిపిస్తున్నారని వాపోయారు. ఇప్పుడు తన కుమార్తెలు దేవి, భార్గవితో పాటు తన ఆడబిడ్డ కుమార్తెలు దేవిశ్రీప్రియ, ప్రసన్న కుమారిలను కూడా కేసులో అక్రమంగా ఇరికించారని తెలిపారు.



అక్రమకేసులపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రోజానమ్మ, విద్యార్థినులు

జాలలపాలెంలో దళితుల ఇళ్లు కూల్చవద్దు

పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌ను కోరిన ప్రజాసంఘాలు, దళిత సంఘాల నేతలు

నరసరావుపేట: వినుకొండ మండలం జాలలపాలెంలోని తమ ఇళ్లు కూల్చవద్దంటూ దళితులు ప్రజాసంఘాల సహకారంతో కలెక్టర్ కృతికా శుక్లాను కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం సమర్పించారు. దీనిపై వారు మాట్లాడుతూ జాలలపాలెంలోని 175 ఎకరాల ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలని కొంతమంది హైకోర్టులో లోకాయుక్తను ఆశ్రయించారన్నారు. ఆ మేరకు హైకోర్టు 2023లో ఉత్తర్వులు ఇవ్వగా నేటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. అయితే గత 20 రోజులు నుంచి పంచాయతీ సెక్రటరీ భాగ్యలక్ష్మి, వీఆర్ఓ గోపాలరావులు దళితులు నివేశ స్థలాలు ఏర్పాటుచేసుకున్న 68/2 సర్వేనెంబర్‌లో గల 58 సెంట్లు భూమి నుంచి వారిని ఖాళీ చేయాలని, ఇళ్లు కూల్చివేస్తామని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. మూడు తరాలుగా గ్రామకంఠం భూమిలో నివాసాలు ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం కట్టించిన ఇళ్లల్లో దళితులు నివాసం ఉండగా, వాటిని ఖాళీ చేయాలని, కూల్చాలనే ఆలోచన అధికారులు మానుకోవాలని కోరారు. ఎవరైతే రికార్డులు ట్యాంపరింగ్‌కు పాల్పడి గ్రామకంఠం భూమిని వేరేలాగా చూపిన రెవెన్యూ వారిపై చర్యలు తీసుకొని అక్కడ ఉన్న నివాస దారులకు రక్షణ కల్పించి, 175 ఎకరాల ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కోట నాయక్, దేశభక్త ప్రజాతంత్ర సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, గ్రామస్తులు పిడతల అంకారావు, మునెయ్య, నారాయణ, కొమ్మతోటి బాలస్వామి పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న నాయకులు

అక్రమ లీజును రద్దు చేయండి

బెల్లంకొండలోని జిల్లా పరిషత్ కార్యాలయానికి చెందిన తొమ్మిది సెంట్ల ఖాళీ స్థలాన్ని తెలుగుదేశం పార్టీ నాయకుడు పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ అధికారులతో కుమ్మక్కై జిల్లా పరిషత్ నియమ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా లీజు హక్కులు పొందటాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు పీజీఆర్ఎస్‌లో సోమవారం అర్జీ అందజేశారు. ఆ అక్రమవేలం లీజును రద్దుచేసి తిరిగి బహిరంగంగా నిర్వహించాలని అధికారులను కోరా రు. బెల్లంకొండ మండలం జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి, మండల వైస్ కన్వీనర్ పాకాలపాటి షేక్ మౌలాలి, కో–ఆప్షన్ మెంబర్ కావూరి షేక్ దరియా, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు గుర్రాల షేక్ బడా బచ్చా, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గడ్డిపర్తి చినబాబురావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రామాంజనేయులు నాయక్ ఉన్నారు.

ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలి

క్రోసూరు పంచాయతీ పరిధిలోని యర్రబాలెం గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా గుర్తించాలని గ్రామ ప్రత్యేక పంచాయతీ సాధనా కమిటీ సభ్యులు తిమ్మిశెట్టి హనుమంతరావు, సోడిశెట్టి నీలేశ్వరావు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ గ్రామంలో 3 వేల మంది జనాభా, రెండువేల వరకు ఓటర్లు ఉన్నారని అన్నారు. ప్రత్యేక పంచాయతీ కావాలని ప్రజల్లోకి వెళ్లిన ప్రతి సందర్భంలోనూ ప్రజలందరూ తమ సంతకాల ద్వారా ఆమోదం తెలియజేస్తున్నారని, ఒకరిద్దరూ అవకాశవాద రాజకీయ నాయకులు మాత్రమే ఆటంకం కలిగిస్తూ ప్రజాభిప్రాయ సేకరణకు పూర్తి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. క్రోసూరు పంచాయతీలో యర్రబాలెం గ్రామం కలిసి ఉన్నందున నిధులు కేటాయింపు సరిగా లేదన్నారు. సమస్యలు పరిష్కరించుకునేందుకు గ్రామసభలు ఏర్పాటు చేయమని అడిగినప్పటికీ నిర్లక్ష్యం చేస్తున్నారని, విధులు ఎంత కేటాయిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం వారు జిల్లా పంచాయతీ అధికారిని కలిసి మాట్లాడారు.